ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
7
ఆదివారం 2 ఫిబ్రవరి 2025



జడ్పీలో.. జగడాలు?

- పాలనలో ఎవరి దారి వారిదే
- పాలకవర్గం, అధికారుల మధ్య కొరవడిన సమన్వయం
- చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య అగాధం
- పరీక్షలు సమీపిస్తోన్నా స్టడీ మెటీరియల్, అల్పాహారం అందని పండే

- జడ్పీ చైర్‌పర్సన్ చెప్పింది సీఈవో చెయ్యరు. ఫైళ్లు పంపిస్తే ఆపేస్తారు.
- సీఈవో మీటింగ్ ఏర్పాటు చేస్తే చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈవో హాజరు కారు.
- డిప్యూటీ సీఈవో ఫైల్ పంపిస్తే సీఈవో పక్కన పెట్టేస్తారు.
- జనవరి 1న విడుదల కావాల్సిన జిల్లా పరిషత్ డైరీ ఫిబ్రవరి వచ్చినా సిద్ధం కాలేదు.
- ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని జడ్పీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇవ్వాల్సిన స్టడీ మెటీరియల్ ఇంకా ప్రింట్ కాలేదు.
- సాయంత్రం పదో తరగతి పిల్లలకు పెట్టాల్సిన అల్పాహారంపై అసలు నిర్ణయమే జరగలేదు.



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇదీ గుంటూరు జిల్లా పరిషత్‌లో నెలకొన్న పరిస్థితి. పాలకవర్గం, అధికారుల మధ్య అగాధం నెలకొందని పై పరిణామాలు చూస్తే అర్థమవుతోంది. జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య సమన్వయ లోపం పాలనలో ప్రతిబింబిస్తోంది. గుంటూరు జిల్లా మూడు ముక్కలు అయినా జిల్లా పరిషత్ ఇంకా ఉమ్మడిగానే ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల అభివృద్ధి చిరునామా జిల్లా పరిషత్ మాత్రమే. అటువంటి జిల్లా పరిషత్ అంతర్గత కుమ్ములాటల్లో చిక్కుకుంది. పాలకవర్గానికి ప్రతినిధిగా ఉన్న చైర్‌పర్సన్‌కు, కార్యనిర్వాహక వర్గానికి ప్రతినిధులుగా ఉన్న సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య అగాధం ఏర్పడింది. ఏమి జరిగిందో ఏమో కానీ ముగ్గురు మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గు మంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ మధ్య జరిగిన అనేక సంఘటనలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ఇటీవల జడ్పీలో ఈ-ఆఫీసుపై సీఈవో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈవో అందుబాటులో ఉన్నా ఆ సమావేశానికి హాజరుకాలేదు. సీఈవో ఒక్కరే సమావేశాన్ని జరిపించేశారు. గత వారంలో గుంటూరు జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవోలు సచివాలయ వ్యవస్థ వల్ల ఎదురౌతున్న ఇబ్బందులను చైర్‌పర్సన్ ముందు ఏకరువు పెడుతున్నారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న సీఈవో ఆ అంశాన్ని మధ్యలోనే ముగించారు. కొన్ని సందర్భాల్లో చైర్‌పర్సన్ మాట్లాడుతున్నా ఆయన అడ్డుతగిలినట్లు అనిపించింది.

విద్యార్థుల ఎదురుచూపులు..

పదో తరగతి విద్యార్థులకు ఏటా జిల్లా పరిషత్ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఈ ఏడాది పరీక్షలకు కేవలం రెండు నెలల వ్యవధి కూడా లేదు. అయినా ఇంతవరకు ఆ ఊసే వినిపించడం లేదు. జడ్పీ పాఠశాలల్లో స్టడీ అవర్‌కు ఉండే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత జడ్పీదే. గత కొన్ని రోజులుగా పాఠశాలల్లో స్టడీ అవర్లు జరుగుతున్నాయి. అయినా ఇప్పటి వరకు అల్పాహారం ఊసే లేదు. అందుకు సంబంధించిన నిధుల విడుదలపై అసలు చర్చ కూడా జరిగినట్లు లేదు.

ఫైళ్లు చక్కర్లు కొట్టాల్సిందే..

ఇక జడ్పీలో ఏ ఫైల్ అయినా కనీ సం మూడు నెలలకు తగ్గకుండా చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈ వోల చుట్టూ చక్కర్లు కొట్టాల్సిందే. కొన్ని కొన్ని సందర్భాల్లో అసలు ఫైల్ ఎవరి దగ్గర ఉందో తెలుసు కోవడం కూడా కష్టంగానే ఉందని జడ్పీవర్గాల సమాచారం. ఈ పరి ణామాల మధ్య జడ్పీలో ఫైళ్ల వ్యవ హారం కత్తిమీద సాములానే ఉంది. కొన్ని వందల ఫైళ్లు పేరుకుపోయి నట్లు తెలుస్తోంది. ఏ ఫైల్‌ని కూడా సక్రమంగా పరిష్కరించడం లేదన్న విమర్శలున్నాయి. చైర్‌పర్సన్ క్లియర్ చేసిన ఫైల్‌ను సీఈవో పెండింగ్‌లో పెడుతున్నట్లు తెలుస్తోంది. సీఈ వో పంపుతున్న ఫైల్‌ను డిప్యూటీ సీఈవో పెండింగ్‌లో పెడుతున్నట్లు సమాచారం.

ఉద్యోగుల ఇష్టారాజ్యం..

ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో ఉన్న కొందరు ఉద్యోగులకు, అధికారులకు మధ్యాహ్నం వరకే విధులు అన్న విధంగా ఉంది. భోజన విరామం తర్వాత చాలా మంది ఇళ్లకు వెళ్లిపోతున్నారు. అదేమని అడిగే నాథుడు లేకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక వేళ సీఈవో దృష్టికి ఈ విషయం తీసుకువెళ్ళినా మందలించలేని పరిస్థితి.

చెల్లింపులన్నీ బంద్..

జడ్పీలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల వల్ల చాలా వరకు చెల్లింపులు నిలిచిపోయాయి. గత సర్వసభ్య సమావేశానికి సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ ఫైల్ ఎవరి దగ్గర పెండింగ్‌లో ఉందో ఎవరికీ తెలియదు. కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు కూడా ఈ మధ్య కాలంలో చాలా కాలం పెండింగ్‌లో ఉంచారు. ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు కూడా చాలావరకు పెండింగ్‌లు ఉన్నట్లు తెలుస్తోంది.

అవినీతి తాండవం..



చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య ఉన్న అంతరం కారణంగా జిల్లా పరిషత్‌లోని కొన్ని విభాగాల్లో అవినీతి తాండవిస్తోంది. అడిగినంత ఇస్తే తప్ప అక్కడ పనులు కావడం లేదని ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని సెక్షన్ల ఏవోలు ఆడిందే ఆట పాడిందే పాట అన్న విధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో రూ.2 లక్షల వరకు వెచ్చించి జడ్పీకి బదిలీ అయిన అధికారులు వాటిని సమకూర్చే పనిలో ఉన్నట్లు ఆరోపణలున్నాయి.





ఉద్యోగుల్లో.. ఉత్సాహం

- బడ్జెట్‌పై పెన్షనర్ల ఆనందోత్సాహాలు
- పన్ను మినహాయింపుపై ఆయా వర్గాల్లో సంబరాలు
- కొనుగోలు శక్తిని పెంచుతుందంటున్న ఆర్థిక నిపుణులు

గుంటూరు, విద్య, తూర్పు, బాపట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు నిధులు.. పలు ప్రాజెక్టులకు ప్రోత్సాహం.. వివిధ రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో సహకారం ఉంటోందని ప్రజలు ఆశించారు. అయితే ఉద్యోగులు, పెన్షనర్లను మాత్రమే నిర్మలా సీతారామన్ ఉత్సాహపరిచారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పెన్షనర్లు, ఉద్యోగులకు వరాల జల్లు కురిపించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రూ.12.75 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదనే తీపికబురు ప్రకటించారు. దీంతో ఉద్యోగులకు వారి జీతాలను బట్టి రూ.30 వేల నుంచి రూ.80 వేల వరకు ఆర్థిక ఉపశమనం కలుగుతుంది. సంవత్సరానికి రూ.12 లక్షల కంటే ఎక్కువ సంపాదించే సాఫ్టువేర్ తదితర రంగాలకు చెందిన ఉద్యోగులకు కూడా దీనిని వర్తింపు చేశారు. ఈ విధంగా అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు ఉద్యోగులకు కొత్త ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఆర్థిక ప్రయోజనాలను కల్పించారు. ఎప్పుడైతే బడ్జెట్ ప్రసంగంలో ఈ విషయాన్ని ఆమె ప్రకటించారో ఆ వెంటనే జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. సహచర ఉద్యోగులకు ఫోన్లు చేసుకుని ఎంత లబ్ధి జరుగుతుందో పరస్పరం పంచుకున్నారు. బడ్జెట్‌పై ఆర్థిక, విద్యావేత్తలు, వామపక్షాల నాయకులు తమ అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

జిల్లా వాసుల్లో నిరాశ

బాపట్ల జిల్లాకు ఆయువు పట్టుగా ఉన్న పర్యాటక రంగం గురించి కేంద్ర బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడంతో జిల్లావాసులు నిరాశకు గురయ్యారు. జిల్లాలో ప్రధానమైన మత్స్యకారులు, ఆక్వారంగాలపై నిర్మలమ్మ పద్దు వరాలు కురిపిస్తుందనుకుంటే ఆ ఊసే కరువైంది. గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేసిన అనేక ప్రాజెక్టులకు సంబంధించి నేతలు నిధుల విజ్ఞాపనలు కేంద్రానికి ఇచ్చినా బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కలేదు. సమీకృత ఆక్వా ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో చోటు దక్కకపోవడంతో జిల్లాప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఆక్వా రంగం విషయంలో ఇచ్చిన ప్రతిపాదనలను కూడా కేంద్రం బుట్టదాఖలు చేసిందనే విమర్శలున్నాయి.

వ్యవసాయానికి ఊతం



కేంద్ర బడ్జెట్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో వ్యవసాయరంగానికి ఊత మిచ్చేదిలా ఉన్నది. జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్(జీబీఎన్ఎఫ్)కు రాష్ట్రానికి కేటాయించిన రూ.186 కోట్లలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు భారీగానే నిధులు సమకూరుతాయని వ్యవసాయ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గుంటూరు జిల్లాలో దాదాపుగా 20 వేల మంది ప్రకృతి వ్యవసాయం చేస్తుండగా వారికి ఎంతో ప్రోత్సాహకరంగా ఉండనున్నది. అదేవిధంగా బాపట్ల జిల్లాలో 40,000 ఎకరాల వరకు సాగు విస్తరించొచ్చనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రెండు జిల్లాల్లో కొత్తగా పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపేలా కేంద్ర బడ్జెట్ కేటాయింపులు న్నాయని అధికారులు చెబుతున్నారు. కిసాన్ క్రెడిట్‌కార్డుల రుణపరిమితి పెంపుతో లక్షల మంది రైతులకు ఆర్థికంగా లబ్ధి జరుగుతుంది. గుంటూరు జిల్లాలో దాదాపుగా 3.50 లక్షలు, బాపట్ల జిల్లాలో 55,000 మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు న్నాయి. ప్రస్తుతం రుణపరిమితి రూ.3 లక్షలు కాగా దీనిని రూ. 5 లక్షలకు పెంచడంతో వ్యవసాయంతో పాటు మత్స్య, పశు సంవర్థక రంగాల్లో రైతులకు లబ్ధి చేకూరుతోంది. ఎంఎస్ఎంఈలపై వరాలతో గుంటూరు జిల్లాలో దాదాపుగా 71 వేల సంస్థలకు మేలు జరగనున్నది. కొత్తగా పరిశ్రమలను విస్తరణతో పాటు ఉత్పాదక శక్తిని పెంచుకొని ఎగుమతులు మరింతగా చేసే అవకాశం కలుగుతోంది.

పెట్టుబడిదారులకు వరం

కేంద్ర బడ్జెట్ సామాన్యులకు శాపంగా, బడా పెట్టుబడిదారులకు వరంగా ఉంది. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రస్తావనే లేకపోవడం విచారకరం. రైతుల పంటలకు కనీస మద్దతు ధరపై ప్రకటన చేయలేదు. విద్యుత్ రంగంలో సంస్కరణలకు ప్రోత్సాహకాలు దుర్మార్గం. డ్వాక్రా మహిళలు, ఎంఎస్ఎమ్ఈలకు రుణాలు పెంచి ఇస్తామని చెప్పడం వారి చేత అప్పులు చేయించడమే లక్ష్యంగా కనిపిస్తుంది.

- జంగాల అజయ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి, గుంటూరు

రాష్ట్రానికి మొండిచేయి

కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, విభజన హామీలు, రాజధాని నిర్మాణం వంటి విషయాల్లో మొండిచేయి చూపింది. పోలవరానికి రూ 5,936 కోట్లు, ప్రాజెక్ట్ అథారిటీకి రూ 54 కోట్లు కేటాయించారే కానీ నిర్వాసితుల గురించి ప్రస్తావనలేదు. వేతన జీవులకు పన్నులు తగ్గించామని చెబుతూ పేద, బడుగు వర్గాలు, మధ్యతరగతి ప్రజలపై జీఎస్టీ పేరుతో భారాలు మోపుతున్నారు.

- వై నేతాజి, సీపీఎం జిల్లా కార్యదర్శి, గుంటూరు

అన్యాయం.. దురదృష్టకరం

రాష్ట్రాభివృద్ధికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు లేకపోవటం దురదృష్టకరం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటీకరించమని, దానికి మైన్స్ కేటాయిస్తామన్న వారు బడ్జెట్‌లో చూపించలేదు. బీమా, బ్యాంకింగ్ రంగాలనుప్రైవేటు కంపెనీల చేతుల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతుంది.

- మస్తాన్‌వలి, మాజీ ఎమ్మెల్యే, గుంటూరు

సంక్షేమం.. అభివృద్ధి

రైతులు, మహిళలు, మధ్య తరగతి, యువత ఇలా ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టారు. రూ.730 కోట్లు ఇవ్వడం ద్వారా విశాఖ పోర్టు సామర్థ్యం పెరుగుతుంది.

- చెరుకూరి తిరుపతిరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, గుంటూరు

నిరాశ మిగిల్చింది

కేంద్ర బడ్జెట్ నిరాశ మిగిల్చింది. విభజన చట్టంలో హామీలకు నిధులు కేటాయించలేదు. వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు, చర్యలు లేవు. ఉపాధి పెంచే దిశగా బడ్జెట్ లేదు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే దిశగా బడ్జెట్ ఉంది. ప్రైవేటీకరణకు అన్ని రంగాల్లో పెద్దపీటవేశారు.

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

ఐటీకి శుభపరిణామం

మధ్య తరగతి వారిని దృష్టిలో పెట్టుకుని ఐటీ విధానంలో మినహాయింపులు కల్పించినట్లుగా భావించవచ్చు. ఆదాయపు పన్ను శ్లాబు విధానంలో మార్పులు, టీడీఎస్, టీసీఎస్ విధానాల్లో కూడా మినహాయింపులు కల్పించారు. వీధి వ్యాపారులకు ముఖ్యంగా రూ.30 వేల వరకు క్రెడిట్ కార్డ్ అందజేస్తామని చెప్పారు. వడ్డీ వ్యాపారుల భారిన పడి వీధి వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. క్రెడిట్ కార్డ్ విధానంతో వారికి ఆర్థిక పరిపుష్టి కల్పించినట్లవుతుంది. వడ్డీపై టీడీఎస్‌ను సీనియర్ సిటిజన్లకు పెంచటం మంచి విషయంగా చెప్పవచ్చు.

- రామరాజు శ్రీనివాస్, మాజీ చైర్మన్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ సౌత్‌జోన్

ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

ఆదాయపు పన్ను శ్లాబు విధానంలో మార్పులు ఆర్థికాభివృద్ధికి దోహదం చేకూరుస్తుంది. కరోనా వలన ఆర్థిక వ్యవస్థకు కొంతమేరకు ఇబ్బంది కలిగింది. ఈ నేపథ్యంలో పన్ను మినహాయింపుల వల్ల ఉద్యోగులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. దాంతో వారు కచ్చితంగా తమకు ఇష్టమైన వస్తువులను కొనుగోలు చేయడం, స్థిరాస్తి, రియల్‌ఎస్టేట్ రంగాల్లో పెట్టుబడులు పెట్టడం వంటివి చేస్తారు. ఇది ఆర్థిక వ్యవస్థని బూస్టప్ చేస్తుంది. బడ్జెట్‌తో చిన్న పరిశ్రమలు, రైతులకు భారీ ఊరట లభించింది.

- ఆడిటర్, దామచర్ల శ్రీనివాసరావు, గుంటూరు

తగ్గింపులు మరింత పెంచాలి

ప్రభుత్వానికి నికరంగా పన్నుల రూపంలో ఆదాయం సమకూరుస్తున్నది ఉద్యోగులే. ప్రామాణిక తగ్గింపు రూ.75 వేలతో కలిపి వార్షికాదాయం రూ.12 లక్షలు ఉంటే ఆదాయపు పన్ను మినహాయింపు కొంత మేరకు ఊరటనిస్తుంది. అయితే తాము తొలి నుంచి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది స్టాండర్డ్ డిడక్షన్(ప్రామాణిక తగ్గింపు)ని రూ.5 లక్షలకు పెంచమంటున్నాం. అప్పుడే ఉద్యోగులకు మేలు కలుగుతుంది. వ్యాపారులు ఐటీ రిటర్న్ ఫైల్ చేసి పన్నుల నుంచి తప్పించుకొంటారు. ఉద్యోగులు మాత్రం అలా కాదు. ఈ నేపథ్యంలో ఇంకాస్త మినహాయింపులు ఇస్తే బావుండేది.

- షేక్ చాంద్‌బాషా, గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

జీఎస్టీ శ్లాబులు తగ్గించకపోకవడం సరికాదు

జీఎస్టీ శ్లాబులు తగ్గించాలని తొలి నుంచి డిమాండ్ చేస్తూ వస్తున్నాం. బడ్జెట్ ప్రకటనలోనూ శ్లాబులను తగ్గించపోవటం విచారకరం. రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయింపులు లేకపోవడం నిరాశ కలిగించింది. బడ్జెట్‌లో చిన్న వ్యాపారులకు పెద్దగా లాభం చేకూర్చింది లేదు.

- ఆతుకూరి ఆంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు.




రేషన్.. కోత

అరకొరగానే కందిపప్పు

- బియ్యం, పంచదారకే పరిమితం
- రాగి, గోధుమ పిండి, జొన్నలు నిలిపివేత

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రేషన్ సరుకులు అంటే.. బియ్యం, పంచదారకే పరిమితమైంది. గతంలో రేషన్ అంటే బియ్యం, పంచదార, కందిపప్పు, రాగులు, సజ్జలు, గోధుమలు, గోధుమపిండి, మార్కెట్‌లో అధిక ధరలున్న నిత్యావసరాలు సబ్సిడీపై అందేవి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల రేషన్ వ్యవస్థను పూర్తిగా మార్చేయడంతో పాటు సరుకుల్లో కోత విధించింది. రేషన్ కార్డుదారులకు బియ్యం మాత్రం అందించారు. కొన్ని దగ్గర్ల అయితే పంచదార కూడా సక్రమంగా అందేది కాదు. ఇక బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు, నూనెలు మండిపోతున్నా వాటి ఊసే నాటి ప్రభుత్వం మరిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్‌లో కొన్నింటిని పునరుద్ధరించినా అది రెండు నెలలకే పరిమితమైంది. ప్రస్తుతం గత వైసీపీ హయాంలో మాదిరిగానే బియ్యం, పంచదారకే రేషన్ పరిమితమైంది. పేదలకు సరుకుల పంపణీలో కూటమి ప్రభుత్వం కూడా కోత విధించింది. ఏ నెలకానెల కందిపప్పు పంపిణీ తగ్గించి వేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ విస్మరించింది. కందిపప్పు అడిగితే పంపిణీ దారులు స్టాక్‌లేవంటున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు గోధుమ, రాగి పిండి సరఫరా నిలిచిపోయింది. జొన్నలు ఒక్క పల్నాడు జిల్లాకే అది కూడా 7.80 లక్షల కార్డుదారులకు, గుంటూరు జిల్లాలో 1,464 మంది కార్డుదారులకు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల జిల్లాకు జొన్నల సరఫరా పూర్తిగా నిలిపివేశారు. రాగి పిండి గుంటూరు జిల్లాలో 115 మంది కార్డుదారులకు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల, గుంటూరు జిల్లాలకు రాగి పిండి పూర్తిగా నిలిపివేశారు. కందిపప్పు 20 శాతానికి లోపే పరిమితం కావడం, రాగి, గోధుమ పిండి, జొన్నలు సరఫరా నిలిపివేయడంతో కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


జొన్నలు

20 శాతమే కందిపప్పు..

పల్నాడు జిల్లాలో 6,34,913 కార్డుదారుల్లో ఈ నెలలో కేవలం 20.52 శాతం మందికి మాత్రమే కందిపప్పు సరఫరా చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. 1,16,759 ప్యాకెట్లకు డీలర్ల నుంచి ఇండెంట్ రాగా శనివారం వరకు 90,178 ప్యాకెట్లు సరఫరా చేశారు. బాపట్ల జిల్లాలో 4,76,553 కార్డులకు 11.43 శాతం మాత్రమే కందిపప్పు సరఫరా చేయనున్నారు. డీలర్ల నుంచి 51,106 ప్యాకెట్లకు ఇండెండ్ రాగా 48,626 ప్యాకెట్లను డీలర్లకు అందజేశారు. గుంటూరు జిల్లాలో 5,89542 కార్డుల్లో 20.95 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేయనున్నారు. 1,16,673 ప్యాకెట్లకు ఇండెంట్ రాగా 1,11,403 ప్యాకెట్లను డీలర్లకు అందజేశారు.

హక్కులపై అవగాహన అవసరం

- ఫిర్యాదుల దినం రోజున వృద్ధులకు బస్సు సౌకర్యం
- విభిన్న ప్రతిభావంతుల పథకాలపై సదస్సులో కలెక్టర్

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు కల్పిస్తున్న హక్కులపై విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారి ఉన్నతికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో శనివారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయాన్ని ఎస్ఎస్ఎన్ కళాశాల వద్ద బీసీ సంక్షేమ శాఖ భవనంలోకి మార్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతులు విధిగా ధ్రువీకరణపత్రం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వయోవృద్ధులకు అవసరమైన చేతి కర్రలను అందుబాటులో ఉంచామన్నారు. వయోవృద్ధులకు ప్రతి సోమవారం ఫిర్యాదుల దినం రోజున బస్సు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతులు మూడు నెలలకు ఒకసారి పింఛన్ తీసుకోవచ్చన్నారు.

ఆస్తులను పిల్లలకు పంచిన తదుపరి నిరాదరణకు గురైన తల్లిదండ్రులకు నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చూస్తామ న్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రంగారావు, ఎల్డీఎం రాంప్రసాద్, జిల్లా అధికారులు వేణుగోపాల్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో 11 లక్షల 70 వేల రూపాయల మోసం
క్రోసూరులో వేంకటేశ్వర స్వామికి అపచారం 8
16 మోటారు సైకిళ్ళు స్వాధీనం... ఇద్దరు దొంగలు అరెస్టు

5లోగా దరఖాస్తు చేసుకోవాలి

రిజర్వుడు మద్యం దుకాణాలపై అవగాహన

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో గీత కార్మిక వర్గీయులకు కేటాయించిన 10 శాతం దుకాణాలకు ఈ నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని డీసీ డాక్టర్ వీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సూపరింటెండెంట్ కార్యాలయంలో శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గౌడ, గౌడ్ కులస్తులకు దరఖాస్తు దఖలు, ఫీజు చెల్లించే విధివిధానాలు, కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.మణికంఠ, ఎక్సైజ్ సీఐ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో ఏడుగురికి ఉద్యోగాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎస్‌బీసీ టెక్నాలజీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఆర్వీఆర్‌అండ్‌జేసీ కళాశాలలోని ఏడుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా తమ కళాశాల విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనతో పాటూ సాంకేతిక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. బహుళ అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు సులభతరంగా పొందుతున్నారని కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాల కృష్ణ తెలిపారు. సీఎస్‌సీ విభాగం నుంచి జి.రూప గాయత్రి, కె.సాయి సింధు, పి.వసుధ, వి.ఆశ్రిత త్రివేణి, డేటా సైన్స్ విభాగం నుంచి బి.నీరజాక్షి, కె.విజయ జేరుష, ఐటీ విభాగం నుంచి జి.అలేఖ్య తదితరులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు తెలిపారు. ఎంపికైన వారిని అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులు

కళాకారులకు ప్రజలే గురువులు

- ప్రజా కళాకారుడు, సినీ నటుడు భూపాల్
- స్ఫూర్తిదాయకంగా ఏఐపీఎల్‌సీఎఫ్ సభలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కళాకారులకు ప్రజలే గురువులని, మొదటగా ఆయా శ్రామిక వర్గాల నుంచే కళాకారులు ఉద్భవించారని ప్రజా కళాకారుడు, సినీ నటుడు భూపాల్ అన్నారు. స్థానిక ఎన్జీవో సమావేశ మందిరంలో అఖిల భారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక (ఐపీఎల్‌ఎఫ్‌సీ) సభలు రెండో రోజున కొనసాగాయి. ఐపీఎల్‌ఎఫ్‌సీ నాయకులు రమణ ప్రసాద్, శ్రీదేవి ఆధ్వర్యంలో పలు రాష్ట్రాలను చెందిన జానపద, ఆదివాసి కళాకారుల ప్రదర్శనలు జరిగాయి. భూపాల్ మాట్లాడుతూ ప్రజల మానసిక ఎదుగుదలకు సాహిత్యం, కళారూపాలు దోహదం చేస్తాయన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు సి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో సినిమాలు వెర్రితలలు వేస్తూ ఉన్మాదానికి గురిచేసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిలభారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక లాంటి సంస్థలు ప్రజలలో నిరంతర చైతన్యం రగిలించి సాహిత్య, సాంస్కృతిక, కళారూపాల, వారసత్వాన్ని కాపాడాలని కోరారు. ఉత్తరాంధ్ర బాల కళాకారులు ప్రదర్శించిన అల్లూరి సీతారామరాజు బుర్రకథ, పశ్చిమ బెంగాల్‌కి చెందిన సౌవిక్ సాంస్కృతిక చక్ర గౌతమ్ ముఖర్జీ బృందం ప్రదర్శించిన 'కెనోనా మానుష్' నాటకం, ప్రజలపై సోషల్ మీడియా ప్రభావంపై ఒంగోలు బాల కళాకారులు ప్రదర్శించిన స్కిట్, జార్ఖండ్ ప్రజా కళాకారులు సంజయ్‌రాయ్ మైధిలి 'మానవ సంకల్పం' అనే అంశంపై ప్రదర్శించిన నృత్యరూపకం, శ్రీకాకుళం జిల్లా ప్రజా కళాకారులు ప్రదర్శించిన భగత్‌సింగ్ ఏకపాత్రాభినం, భారతీయ సమాజంపై కులవ్యవస్థ పట్టుని కళ్లకు కట్టినట్లు ప్రకాశం జిల్లా కళాకారులు ప్రదర్శించిన 'బహిష్కరణ' నాటకం, విజయవాడ ప్రజా కళాకారులు ప్రదర్శించిన 'ఎత్తిన జెండా దించకోయ్' దృశ్యరూపకం, కొమ్ము నృత్యాలు, సామాజిక చైతన్యాన్ని నింపే గజల్ పాటలు, వేణుగానం వంటివి ప్రేక్షకులను ఆలోచింపచేశాయి. కార్యక్రమంలో సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు దివి కుమార్, కార్యదర్శి డాక్టర్ బి. అరుణ తదితరులు పాల్గొన్నారు



ప్రసంగిస్తున్న భూపాల్



గౌతమ్ ముఖర్జీ బృందం ప్రదర్శిస్తున్న కెనో నమానుష్ నాటకంలో ఓ సన్నివేశం



సామాజిక చైతన్యం నింపే పాటలను ప్రదర్శిస్తున్న కళాకారులు

ఎదగాలంటే ఒదిగి ఉండాలి

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి మనిషి కింది స్థాయి నుంచి పైస్థాయికి ఎదగాలంటే అధికారం ఉన్నా, లేకున్నా ఒదిగి ఉండాలనీ, అప్పుడే అందరి మన్ననలను పొంది అభివృద్ధి వైపు పయనించ వచ్చునని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం మాచవరం మండలంలోని జీవీజీకేఆర్‌వో ఉన్నత పాఠశాలను, ఎస్టేట్‌ను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన జీవీజీకే ఆర్‌వో పాఠశాలకు, ఎస్టేట్‌కు సంబంధించి సుమారు మూడు వందల ఎకరాలు భూమిని దాతలు దానంగా ఇచ్చారని తెలిపారు. రంగులు వేసి నాడు-నేడు అని చెప్పడం కాదనీ, పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేయడం ముఖ్యమన్నారు. పాఠశాలకు కావాల్సిన ఐదు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణానికి కావాల్సిన నిధులను ప్రభుత్వం ద్వారా సమకూరుస్తానని తెలియజేశారు. పాఠశాల స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపౌండ్ వాల్ ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రపంచ స్థాయిలో విద్యా ప్రమాణాలను అన్వేషించి మన రాష్ట్రంలో అవలబించే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. పాఠశాల విద్యార్థుల కోసం మినీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉన్న వారు పాఠశాల అభివృద్ధికి, వసతుల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. పిల్లుట్ల గ్రామంలో టీడీపీ నాయకుని కుమార్తె ఓణీల కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కొత్తగణేషునిపాడు గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న పలువురిని పరామర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ నంద్యాల ధనుంజయ్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బడిగుంతల వెంకటేశ్వర్లు, సర్పంచి రఘువరపు శివ పార్వతి సాంబశివరావు, సత్యనారాయణరాజు, ఎన్ శ్రీనివాసరావు, పలిశెట్టి వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసరావు, ఖాజావలి, మాజీ ఎంపీపీ కత్తి సరోజిని శ్రీనివాసరావు, జక్కా వాసు, గోపాలరావు, ఎంపీటీసీ కె.అంజమ్మ వీరాస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు సాంబయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పిల్లుట్ల హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలి

- టొబాకో బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు
- విజ్ఞాన్‌లో వైభవంగా ముగిసిన బాల మహోత్సవ్2కే25



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అద్దంకి శ్రీధర్‌బాబు, డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్యం నుంచే విభిన్నంగా ఆలోచించే అలవాటును పెంచుకోవాలని గుంటూరులోని టొబాకో బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్ శనివారం అంగరంగ వైభవంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుంటూరులోని టొబాకో బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు విభిన్న ఆలోచనలతో మెలగాలన్నారు. విద్యార్థులు ఎప్పుడూ నవ్వుతూ సంతోషంగా ఉండాలన్నారు. సానుకూలంగా ఆలోచిస్తూ వీలైనంత వరకు పక్క వాళ్లతో సంతోషంగా గడపడానికి ప్రయత్నించాలన్నారు. ఏ రంగంలో ఇష్టం ఉంటే ఆ రంగంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఎమోషనల్‌గానూ, మెంటల్‌గాను దృఢంగా ఉండాలన్నారు. లక్ష్యం ఉండాలని, దాని సాధించేంత వరకు అవిశ్రాంతంగా కష్టపడాలన్నారు. రాష్ట్ర స్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో భాగంగా మొత్తం 50 ఈవెంట్లను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు విలువైన నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, లారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రోసూరులో వేంకటేశ్వర స్వామికి అపచారం

- శంకు చక్రం, నామం, నమూనాల దిమ్మెలను కూలదోసిన గుర్తుతెలియని దుండగులు
- శివలింగం ధ్వంసం

క్రోసూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామికి తీవ్ర అపచారం జరిగింది. భక్తులు వివాహాలు, శుభ కార్యాల సమయంలో వేంకటేశ్వర స్వామికి ఎదురు నడిచి పూజించే ప్రాంగణంలో ఉన్న శంకు చక్రాలు, నామం నమూనా దిమ్మెలను దుండగులు కూల్చి వేశారు. ప్రాంగణంలో ఉన్న శివలింగం విగ్రహాన్ని ధ్వంసం చేసి దూరంగా విసిరి వేశారు. అక్కడే ఉన్న పూజా సామగ్రి, మంగళ తోరణాలను దహనం చేశారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. స్థానిక ప్రజలు పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీసు స్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు, అడిషనల్ ఎస్పీ సంతోష్, పెదకూరపాడు సీఐ పత్తిపాటి సురేష్, క్రోసూరు ఎస్ఐ నాగేంద్రరావు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పరిస్థితిని సమీక్షించారు. వెంటనే డాగ్ స్క్వాడ్‌ను, క్లూస్ టీమ్‌ను పిలిపించారు.



దుండగులు పడదోసిన శంకు చక్రాలు, నామం నమూనాల దిమ్మెలు

నిందితులను అరెస్టు చేస్తాం

నిందితులను వెంటనే అరెస్టు చేయాలని హిందూ సంఘాల వారు, శ్రీవారి భక్తులు ప్రధాన రహదారిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా జరిపారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్ కొద్ది సేపు సంఘటన జరిగిన ప్రాంతంలో సంచరించి రోడ్డు పైన, ఊరి బయట కొద్ది సేపు తచ్చాడింది. నిందితులు ఎంతటి వారైనా వెంటనే అరెస్టు చేస్తామని ఎస్పీ కే శ్రీనివాసరావు విలేకరులతో అన్నారు. కొంతమంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పెదకూరపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన బాల మహోత్సవ్ 2కే25 అండర్-17 విభాగంలో జరిగిన వాలీబాల్ క్రీడా పోటీల్లో పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య పాఠశాల క్రీడా జట్లు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాయని జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ గుత్తా కవితా రాము శనివారం తెలిపారు. బాలురు, బాలికల విభాగంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవడంతో వారికి విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ గుత్తా కవిత రాము క్రీడాకారులతో కలిసి ట్రోఫీని అందుకున్నారు.




బహుమతులు అందజేస్తున్న విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య

గురజాల సబ్‌జైలు సూపరింటెండెంట్ బదిలీ

- ఖైదీ సెల్‌ఫోన్ వినియోగమే కారణమా?

గురజాలటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గురజాల సబ్‌జైల్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డిని జైలు శాఖ ఉన్నతాధికారులు అనంతపురం ఓపెన్ ఎయిర్ జైల్‌కు బదిలీ చేశారు. ఈ సబ్‌జైల్‌ను గత నెల 16వ తేదీన జైలు శాఖ డీఐజీ వరప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్‌జైల్‌లో ఖైదీ సెల్‌ఫోన్ వినియోగిస్తున్నాడనే ఆరోపణలు రావడంతో డీఐజీ వరప్రసాద్ తనిఖీకి వచ్చినట్లు సమాచారం. కాగా పదిహేను రోజుల వ్యవధిలోనే సూపరింటెండెంట్‌తోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లు కూడా బదిలీ అయ్యారు. వీరిలో ఒకరు అనంతపురం జిల్లా ధర్మవరం సబ్‌జైలు, మరొకరు చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తికి బదిలీ అయ్యారు. ఖైదీ సెల్‌ఫోన్ వినియోగంలో వాస్తవం ఉండడం వలనే ఉన్నతాధికారులు బదిలీలు చేసినట్లు తెలిసింది.

బాధ్యతలు స్వీకరించిన అచ్చినాయుడు



గురజాల సబ్‌జైలు సూపరింటెండెంట్‌గా అచ్చినాయుడు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం ఓపెన్ ఎయిర్ జైల్ నుంచి బదిలీపై గురజాలకు వచ్చారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సుబ్బారెడ్డిని అనంతపురం జైల్‌కు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అచ్చినాయుడును సబ్‌జైల్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కారంపూడి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఒప్పిచర్లలో శనివారం జరిగింది. ఫిరంగిపురంకు చెందిన ఆళ్ల అనిల్‌కుమార్ (40) గుంటూరు మిర్చి యార్డులో పని చేస్తుంటాడు. ఆ పనులపై ఒప్పిచర్లకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళ్తుండగా గ్రామంలోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే కారంపూడి నుంచి మాచర్ల వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో అనిల్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ టీవీ శ్రీనివాసరావు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

16 మోటారు సైకిళ్లు స్వాధీనం

నూజెండ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతూ రవ్వారం కొండ వద్ద దాచిన 16 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ సుధాకర్ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డిపాలెంకు చెందిన జి.బాల కాశిరెడ్డి, రవ్వారం గ్రామానికి చెందిన పి. గురవారెడ్డి ద్విచక్ర వాహనాలను దొంగిలించి రవ్వారం కొండవెనుక దాచారని, ద్విచక్ర వాహనాలపై పలు ఫిర్యాదులురాగా విచారణ చేస్తున్న సమయంలో నూజెండ్లలో వీరిని అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ.8.50 లక్షలు విలువ చేసే 16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. రూరల్ సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ ఐనవోలు పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ఐ కృష్ణారావు, సిబ్బంది ఇటీవల కాలంలో ట్రాన్స్‌ఫారాల దొంగలు, మోటారు సైకిళ్ల దొంగలను అరెస్టు చేసి ఉత్తమ ప్రతిభ చూపారని అభినందించారు.

ఆన్‌లైన్‌లో రూ.11.70 లక్షలు దోపిడీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత మాటలతో బెదిరించి పట్టణానికి చెందిన ఓ మహిళ వద్ద నుంచి రూ. 11.70 లక్షలు దోచేసిన సంఘటన శనివారం పట్టణంలోని పెద్ద చెరువులో చోటుచేసుకుంది. రెండో పట్టణ సీఐ హైమారావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పెద్ద చెరువు కు చెందిన సత్యశ్రీకి శనివారం మధ్యాహ్నం ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాము ముంబాయి నుంచి మాట్లాడుతున్నామనీ, సత్యశ్రీకి ఓ పార్సిల్ వచ్చిందనీ, అందులో మాదకద్రవ్యాలు, ఆయుధాలు ఉన్నాయని ఆమెను బెదిరించారు. ఈ అంశాలపై సత్యశ్రీపై కేసు నమోదు చేయబోతున్నామని వివరించారు. కేసులు లేకుండా చేసుకోవాలంటే రూ.11.70 లక్షలు చెల్లించాలని బెదిరించారు. భయాందోళనలకు గురైన సత్యశ్రీ తన వద్ద అంత నగదు లేదని తెలుపగా, ఫోన్ చేసిన వారే లోన్ యాప్‌లో రూ. 11.70 లక్షలు లోన్ ఇప్పించి, ఆమె నుంచి సదరు నగదును తమకు ట్రాన్స్ఫర్ చేయించుకున్నారు. తదుపరి తాను మోసపోయానని తెలుసుకున్న సదరు మహిళ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమా రావు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

ఆకలి సూచీలో 106వ స్థానంలో భారత్

- రైతుల ఆత్మహత్యలు.. ఆకలిచావులను పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం: ఎంఏ బేబి
- కేంద్రం హోదా ఇస్తే.. పరిశ్రమలు అవే వస్తాయి: వీఎస్ఆర్
- నెల్లూరులో ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర మహాసభలు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచంలోని 127 దేశాల్లో ఆకలి సూచికలో భారతదేశం 106వ స్థానంలో ఉంది. కడుపు నిండా తిండి పెట్టలేని పరిస్థితి దేశంలో ఉంది' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి వెల్లడించారు. ఆపార్టీ 27వ రాష్ట్ర మహాసభలు శనివారం నెల్లూరులో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఈ సభలు జరిగే అనిల్ గార్డెన్స్‌కు సీతారాం ఏచూరి ప్రాంగణంగా నామకరణం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి మాట్లాడుతూ... 'దేశంలో ఆకలి కేకలు వినిపిస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఆర్థికవేత్తలు ఎన్ని సూచనలు చేసినా కేంద్రం తగిన విధంగా స్పందించకపోవటంతో గిరిజనులు, వెనుకబడిన వర్గాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో 1,00,474 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతి 24 గంటలకు 34 మంది రైతులు, కూలీలు ఆత్మహత్య చేసుకుంటుంటే బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తోంది? ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పూర్తిగా ముస్లింలు ఉన్న నియోజకవర్గాల్లో బీజేపీ గెలవడానికి కారణం... కొన్ని ప్రాంతాల్లో ముస్లిం ఓటర్లను ఓట్లు వేయకుండా భయపెట్టింది. మరికొన్ని చోట్ల భయపెట్టి ఓట్లు వేయించుకుంది. వామపక్ష నేతలు అధికారంలో ఉన్న దేశాల్లో ఎన్నో సంస్కరణలు జరుగుతున్నాయి. ఆయా దేశాలను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది' అని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... 'బీజేపీ, మతతత్వాన్ని రెచ్చగొట్టి మతాల మధ్య చిచ్చు పెడుతోంది. ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఏపీకి ఇప్పటివరకు రూ.3 లక్షల కోట్ల నిధులు ఇచ్చినట్లు ప్రకటించారు. ఆ నిధులు ఏమయ్యాయో సీఎం చంద్రబాబు స్పష్టం చేయాలి. ఈ నిధులే వచ్చి ఉంటే రాష్ట్రంలో టీడీపీ ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు రూ.20 వేలు ఇవ్వవచ్చు కదా? అలాగే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీ కూడా అమలు చేయాలి' అని విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... 'దావోస్ వెళ్లి పారిశ్రామికవేత్తలను కలిసి పరిశ్రమలు తెవడానికి కృషి చేస్తున్నట్లు చంద్రబాబు చెబుతున్నారు. అదే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే పరిశ్రమలు వాటంతట అవే వస్తాయన్న విషయాన్ని ఆయన గుర్తించాలి. ప్రత్యేక హోదాపై ఒత్తిడి చేయాలి' అని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, పుణ్యవతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా పతాకావిష్కరణ చేస్తున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ, బీవీ రాఘవులు, ఆ పార్టీ నేతలు వి.శ్రీనివాసరావు, గఫూర్, మధు, బాబూరావు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 35.03 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థినులకు అపారల్ ట్రేడ్ శిక్షణ

కారంపూడి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొదమగుండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులకు శనివారం అపారల్ ట్రేడ్ (స్టిచ్చింగ్, డిజైనింగ్) శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాచేపల్లిలో మగ్గం పనులు జరిగే ప్రాంతానికి విద్యార్థినులను తీసుకొచ్చి స్టిచ్చింగ్, యాంబ్రాయిడింగ్ వర్క్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నల్లపాటి వెంకట సాంబశివరావు, అపారల్ ట్రైనర్ షేక్ ముంతాజ్‌బేగం, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఆదరణకు ఉద్యోగుల చేయూత

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమానికి పాలడుగు బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ఉద్యోగులు శనివారం రూ.5 వేలు విలువ గల గ్యాస్ పొయ్యి, రెండు ఐరన్ ర్యాకులు, వృద్ధులకు నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కేఎస్ మనోజ్ కుమార్, జాకీర్ హుస్సేన్, చిలకా శ్రీనివాసరావు, ప్రదీప్, కృపామణి, బాజీ తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు కొమ్మవరపు ఇద్రసేనబాబు, ఏరిషితలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సబ్ కోర్టు ఉద్యోగి మృతి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్ కోర్టులో పని చేస్తున్న బీ శ్రీనివాసరావు(58) శుక్రవారం అర్ధరాత్రి గుంటూరులోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న పలువురు కోర్టు ఉద్యోగులు, సిబ్బంది గుంటూరు వెళ్ళి ఆయన మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంది రైతులు పంట నమోదు చేయించుకోవాలి

మాచవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కంది పంట వేసిన రైతులు వారి వారి గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాల్లో పంటను నమోదు చేయించు కోవాలని ఏవో రామమ్మ రైతులకు సూచించారు. ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలనే రైతులు రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి ఆధార్ కార్డుతో రిజిస్టర్ చేయించు కోవాలన్నారు. తేమ శాతం 12 వచ్చే వరకు ఆరోగ్యశ్రీ, ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా 7550 మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించు కోవాలని కోరారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణం, ముప్పాళ్ళ రాజుపాలెం మండలాల్లోని గౌడ సామాజికవర్గం వారు మద్యం షాపుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ విజయ కుమార్ అన్నారు. శనివారం ఎక్సైజ్ స్టేషన్‌లో కల్లు గీత కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఒక్కొక్క షాపుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవటానికి ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉందని తెలిపారు. కల్లు గీత కార్మికులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చి దరఖాస్తు చేసుకొనే విధానాన్ని ఆయన వివరించారు. సమావేశంలో ఆయనతో పాటు ఎక్సైజ్ ఎస్ఐ కే నాగలక్ష్మి ఉన్నారు.

వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయాలి

నకరికల్లు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అన్ని ఎస్‌డబ్ల్యూఎస్ పీసీ షెడ్లలో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయటం ప్రారంభించాలని ఈవోపీఆర్‌డీ కేవీఎస్ ప్రసాదు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఫిబ్రవరి 15 నాటికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ విధానం అమలు కావాలని డీపీవో ఎం విజయ భాస్కర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. శనివారం చల్లగుండ్లలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీఎస్ అబ్దుల్లా పాల్గొన్నారు.

95 శాతం పింఛన్‌ల పంపిణీ

నకరికల్లు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను శనివారం 95 శాతం పంపిణీ చేసినట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. 144 మంది సిబ్బంది ఈ పింఛన్ పంపిణీలో పాల్గొన్నారు. మిగిలి పోయిన పింఛన్‌లను ఆదివారం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండి సకాలంలో పింఛన్‌లు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ఉసర్తి శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ కేవీఎస్ ప్రసాదు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

అమరావతి, ఫిబ్రవరి 1: రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా గుంటూరు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పల్నాడు జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలో శనివారం లేగదూడల ప్రదర్శన జరిగింది. 42ముర్రా జాతి దూడలు, 2ఒంగోలు, 1పుంగనూరు దూడలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ బాలశంకర్, ఏడీ డాక్టర్ కె వెంకట్రామయ్య న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మేకల బాలస్వామి, కేవెంకటేశ్వరరావు, వై మణీంద్ర, ఎం. రమేష్‌లకు చెందిన దూడలు బహుమతులు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ ప్రభావతి, డాక్టర్ సారధి, డాక్టర్ శివయ్య, రైతులు పాల్గొన్నారు.

'సక్షం'తో అంగన్‌వాడీలకు మహర్దశ

- సమకూరుతున్న మౌలిక సదుపాయాలు
- వివిధ ప్రాంతాల్లో శరవేగంగా పనులు
- గార్డెన్ కిచెన్‌తో సేంద్రియ సాగు
- చిన్నారులు, గర్భిణులకు సమతుల్య ఆహారం



మాదల అంగన్ వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్



మాదల అంగన్‌వాడీ కేంద్రంలోని వివిధ రకాల వస్తువులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్షం పథకం కింద కిచెన్ గార్డెన్, ఇతర అదనపు సౌకర్యాల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరే చేస్తోంది. దీంతో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల రూపు రేఖలు మారనున్నాయి.

సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సక్షం పథకం కింద మాదల - 6, తొండపి - 1, 2, చాగల్లు - 1,3, త్రిపురాపురం అంగన్ వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు. గర్భిణులు, బాలింతలు, బాలికలకు సమతుల్యమైన ఆహారాన్ని అందించటమే లక్ష్యంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.10వేలతో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేశారు. ఆ గార్డెన్‌లో సేంద్రీయ సాగు విధానంలో కూరగాయలు, ఆకుకూరలు, మునగాకులను పండిస్తున్నారు. విత్తనాలు, మొక్కల కొనుగోలు, ఎరువులు తదితర వాటికి ఈనిధులను వెచ్చిస్తున్నారు. కిచెన్ గార్డెన్ నుంచి వచ్చిన ఆకు కూరలు, పండ్లను అంగన్ వాడీ కేంద్రాల అవసరాలతో పాటు లబ్ధిదారులకు అందచేస్తున్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటు..

భూగర్భ జలాలు మరింత అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో వర్షపు నీటిని నిల్వ చేసుకొనేందుకు అంగన్ వాడీకేంద్రం పరిసరాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలి. ఇందుకోసం ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.16 వేలు మంజూరు చేసింది. ఆ నిధులతోనే అవసరమైన వివిధ రకాల సామగ్రినీ సమకూరుస్తున్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచే మొక్కలు, పండ్లసాగుపై అవగాహన కల్పిస్తున్నారు. మొక్కల పెంపకంపై వాస్తవిక జ్ఞానాన్ని పిల్లలకు అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది.

పోషకాహారంతోనే ఆరోగ్యం ..

గర్భిణీలు, బాలింతలకు మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల చిన్నారులకు సహజ సిద్ధమైన ఎరువులతో ఆకుకూరలు, పండ్లు పండించి అందించటంతో మహిళల్లో రక్తహీనత తగ్గుతుంది. పిల్లలకు పోషకాహారం దక్కుతుంది. తక్కువధరతో ఇంటి ఆవరణలో సాగుచేయాలనే ఆలోచన వస్తుంది. పథకంలో భాగంగా ఆయా అంగన్ వాడీ కేంద్రాల్లో సాంకేతిక పరిజ్ఞానమైన టీవీల్లో బొమ్మలతో చదువుగా చదువు నేర్పించటం జరుగుతుంది.

పాఠశాల అంటే భయం పోతుంది



సక్షం పథకం ద్వారా అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆటలు అలవడతాయి. ఆరు సంవత్స రాల అనంతరం పాఠశాలంటే పిల్లలకు భయం పోతుంది. పిల్లలకు చిన్ననాటి నుంచే మొక్కలు, పండ్ల సాగు పై అవగాహన కల్పిస్తాం.

- శ్రీలత,సత్తెనపల్లి ఐసీడీఎస్ సీడీపీవో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధిక మెజార్టీ సాధించాలి

- పార్టీ శ్రేణులు ప్రతి ఓటరును కలుసుకోవాలి
- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా పార్టీ నిర్ణయించిన మాజీ మంత్రి డాక్టర్ ఆలపాటి రాజాను అధిక మెజారిటీతో గెలిపించాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం పిడుగురాళ్లలో పట్టభద్రుల ఎన్నికలపై నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతి 50 మంది ఓటర్లకు ఇన్‌చార్జిని నియమించాలన్నారు. ప్రతిరోజు పార్టీ నిర్ణయించిన బూతు, యూనిట్ ఇన్‌చార్జిలు ఆ 50 మంది ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకొని కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సాధించిన విజయాలు వివరించి, కూటమి అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకత గురించి వివరించాలన్నారు. టీడీపీ సభ్యత్వంలో గురజాల ముందువరుసలో వుందని, ఒక్కరోజులో 10 వేల 400 సభ్యత్వాలు పూర్తిచేసిన ఘనత గురజాల పార్టీ శ్రేణులదేనని, ఇప్పుడు లక్షా 14 వేల 500తో సభ్యత్వాలు పూర్తయ్యాయన్నారు. ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆలపాటి రాజా గెలుపుకోసం మనమందరం ప్రతి పట్టభద్రుల ఓటరును వ్యక్తిగతంగా కలుసుకొని రాజా గెలుపు కన్నా మెజారిటీ ముఖ్యమే అన్నట్లుగా కృషిచేయాలన్నారు. ఏడు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, రాబోయే మూడు నెలల్లో చంద్రబాబు ప్రవేశపెట్టనున్న మూడు పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, యువ నేత యరపతినేని నిఖిల్, డాక్టర్ వున్నం నాగమల్లికా ర్జునరావు, కర్నాటి వరలక్ష్మీ, పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, యేలూరి శశి, బెల్లంకొండ భద్రి, బడిగుంచల వెంకటేశ్వర్లు, కటకం అంకారావు, రమేష్, భాస్కరరావు, బాబావలి, కోట హరి, రవి, చెన్నారావు, బుల్లయ్య, శ్రీను, ఎల్‌వీఆర్, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా ఉండాలి

- తహసీల్దార్ కిరణ్‌కుమార్

మాచర్లటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని చెన్నకేశవ నగర్ కాలనీలో శనివారం ఎండీయూ వాహనం వద్ద రేషన్ సరుకుల పంపిణీని ఆయన పరిశీలించారు. లబ్ధిదారుల వద్ద నుంచి బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలను తీసుకొని స్వయంగా సరుకులను అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేలా ఆయా డీలర్లు, వీఆర్‌వోలు పర్యవేక్షించాలని డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి ఆదేశించారు. శనివారం మండల కేంద్రమైన మాచవరంలో రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో బియ్యానికి బదులు డబ్బులు ఇస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయని, అలాంటి జరుగకుండా డీలర్లు చూసుకోవాలని తెలియ జేశారు. ఆమె వెంట స్థానిక వీఆర్‌వో శ్రీలక్ష్మి ఉన్నారు.

డీటీపీ కోర్సులో ఉచిత శిక్షణ

నకరికల్లు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ డీటీపీ కోర్సులో యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నెల రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ జీబీ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువత ఈ శిక్షణ ఉచితంగా పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9700687696, 8125397953, 9949930155 నెంబర్లలో సంప్రదించాలని జీబీ కుమార్ సూచించారు.

కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం

దుర్గి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరులో శనివారం కంది కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ డీఎం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది మద్దతు ధర రూ. 7550 ఉందన్నారు. కందులు కొనుగోలు అనంతరం నగదును రైతు బ్యాంకు ఖాతాకు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో హరిగోపాల్, ఏవో అమీర్‌రెడ్డి, అరుణ్, వీహెచ్ఎ అశోక్, వీఏఏ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి కళ్యాణ మహోత్సవం

అచ్చంపేట, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మాదిపాడు పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో వేంచేసి ఉన్న సత్తెమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం సత్తెమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ తిరునాళ్ళ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎం కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజా కార్యక్రమం, 10 గంటలకు అమ్మవారి వార్షిక దివ్యకళ్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం ఒంటి గంటకు మాదిపాడు టీడీపీ నేత కొలగాని సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. వేలాది మంది భక్తులు విచ్చేసి అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కొప్పుల నాగేశ్వరరావు

దాచేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ దాచేపల్లి మండల అధ్యక్షుడిగా కొప్పుల నాగేశ్వరరావు నియమితులైనట్లు గురజాల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఆరె వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం బీజేపీ మండల రిటర్నింగ్ అధికారి పెనుగొండ అమృత లింగేశ్వరరావు, కో-రిటైరింగ్ అధికారి అనంత నరసింహారావు, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గువ్వల వెంకటమనోజ్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, ఎం.సైదారావు, రాధాకృష్ణమూర్తి, సీతారామిరెడ్డి, నర్సిరెడ్డిల నుంచి నాగేశ్వరరావు నియామక పత్రం అందుకున్నారు.



దేవేంద్రయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీధర్

దేవేంద్రయ్య చిత్రపటానికి నివాళి

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ధరణికోట గ్రామ టీడీపీ సీనియర్ నేత సీతారామాంజనేయ ఎత్తిపోతలపథకం మాజీచైర్మన్ వట్టికుంట దేవేంద్రయ్య ఇటీవలమరణించారు. కాగా శనివారం టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ దేవేంద్రయ్య ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దేవేంద్రయ్య మృతి టిడీపీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాదివిష్ణు, స్థానికనేతలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- తహసీల్దార్ ఫణీంద్రకుమార్

దుర్గి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని తహసీల్దార్ ఫణీంద్రకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తి మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, నేతల ఫోటోలు స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. ఈ సమావేశంలో కూటమి నేతలు జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, పులి హరి, దిగుమర్తి సుబ్బారావు, వెలిదండి శ్రీనివాసరావు, రుద్రాల రవి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

క్రోసూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా (44)అనే వ్యక్తి ప్రమాదానికిగురై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. కరిముల్లా శుక్రవారం రోడ్డు మీద వెళ్తూ తూలి పడిపోయాడు. బలమైన గాయాలు తగలటంతో స్థానికులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు తెలిపారు. మృత దేహానికి క్రోసూరు పోలీసులు పంచనామా నిర్వహించారు. ఎస్ఐ నాగేంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బెల్లంకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు ఆయుర్వేద వైద్యులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవిలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రంలో ప్రిన్సిపల్ పెద బాబు, ఉషారాణి, శ్రీనివాసరావు, భూక్యా హనుమంతరావు నాయక్ పాల్గొన్నారు.

కేజీబీవీలో భోజనం తనిఖీ

అచ్చంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో శనివారం తహసీల్దార్ కే శ్రీనివాస్ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. హాస్టల్‌లో మెను ప్రకారం భోజనం ఇస్తున్నారా? అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. వసతుల పై ఆరా తీశారు. భోజనం సంతృప్తిగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో దీప్తి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దైద మేజర్‌కు షట్టర్ ఏర్పాటు పూర్తి

- యథావిధిగా కాలువకు నీటి విడుదల
- ఫలించిన ఎమ్మెల్యేలు యరపతినేని, జూలకంటిల కృషి



దైద మేజర్‌లో షట్టర్ ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ కృష్ణమోహన్ తదితరులు

రెంటచింతల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) దైద మేజర్‌కు సంబంధించి షట్టర్ ఏడు రోజుల క్రితం విరిగిపోయి నీళ్లలో పడిపోయింది. దీంతో పూర్తి స్థాయిలో కాలువలకు నీటిని విడుదల చేయలేక పోయారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యరపతినేని శ్రీనివాసరావులు సీఈ శ్యాంప్రసాద్ (ప్రాజెక్టు, ఒంగోలు) దృష్టికి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నుంచి షట్టర్ ఏర్పాటు పనులను ముమ్మరం చేశారు. సాగర్ మెయిన్ కెనాల్ నుంచి బుగ్గవాగుకు 2500 క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా చర్యలు చేపట్టారు. అలాగే బుగ్గవాగు నుంచి ఇతర కాలువలకు 3 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేశారు. దీంతో క్రేన్‌తో చేపట్టిన పనులు కొలిక్కి వచ్చాయి. శనివారం సాయంత్రానికి విరిగిపోయిన షట్టరుకు మరమ్మతులు నిర్వహించి అమర్చారు.

మధ్య తరగతి ప్రజలకు అనువైన బడ్జెట్

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్య తరగతి ప్రజలకు ఎంతో అనువుగా ఉందని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఇంటికి కుళాయిద్వారా తాగునీరు అందించే పథకానికి కాలపరిమితిని 2028 వరకు పెంచటం మంచి నిర్ణయమన్నారు. టాయ్ సెక్టార్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో రాష్ట్రానికి కల్పించిన ప్రాధాన్యత ద్వారా మరింత మందికి ఉపాధి కలుగుతుందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం పనులు పూర్తిచేసుకునే విధంగా బడ్జట్ ఉందని, నియోజవర్గ ప్రజల తరుపున ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబునాయుడులకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు.



జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్న వేటపాలెం ఎడ్ల జత

వేటపాలెం ఎడ్ల జతకు ప్రథమ బహుమతి

రెంటచింతల,ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కానుకమాత 175వ తిరునాళ్ల ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గత ఐదు రోజుల నుంచి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా శనివారం జూనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో అత్తోట శిరీషాచౌదరి,శివకృష్ణ చౌదరి(వేటపాలెం,బాపట్ల జిల్లా)వేగినాటి జేసురారెడ్డి (బేస్తవారిపేట,ప్రకాశం జిల్లా)కంబైన్డ్ ఎడ్ల జత 2734 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి,డీ.రోషన్‌బాబు(హైదరాబాద్) ఎడ్ల జత 2700.10 అడుగుల దూరం లాగి రెండవ బహుమతి,పెరుమాళ్ల శివకృష్ణాయాదవ్ (పొద్దుటూరు, కడప జిల్లా) ఎడ్ల జత 2478.10 అడుగుల దూరం లాగి మూడవ బహుమతి,డి.రోషన్‌బాబు(హైదరాబాద్)కు చెందిన ఎడ్ల జత 2456.7 అడుగుల దూరం లాగి నాల్గవ బహుమతి,కేతినీడి తేజోమూర్తి(హనుమాన్ జంక్షన్, కృష్ణా జిల్లా)2140.4 అడుగుల దూరం లాగి ఐదవ బహుమతిని గెలుచుకున్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రి 9 గంటల 30 నిమిషాల వరకు పందేలు నిర్వహిస్తున్నారు.మొత్తం 12 జతలు పాల్గొన్నాయి.9 జతలకు వివిధ రకాల బహుమతులివ్వగా మరో 3 జతలకు కన్సోలేషన్ బహుమతులను అందచేశారు. ఈ వివరాలను వెల్లడించిన వారిలో వైఎల్ మర్రెడ్డి, సుమంత్‌రెడ్డి, అల్లం ప్రతాపరెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, రామృష్ణ, శౌర్రెడ్డి, రాయపరెడ్డి, ఏరువ జోజిరెడ్డి, జోసఫ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలి

వినుకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలో జలాలపాలెం పంచాయతీలోగల 175 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది భూస్వాములు రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమించుకున్న భూములను విజయవాడ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో మాల్బారి ఆగ్రోటెక్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో తనకా పెట్టడం జరిగిందని, ఈ భూములపై గతంలో గ్రామస్థులు హైకోర్టు, లోకాయుక్తను ఆశ్రయించడం జరిగిందని, ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ వీ సుబ్బారావు

నూజెండ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్ వీ.సుబ్బారావు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత, శుచి, శుభ్రతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీ.రవి కుమార్, ఎంఈవో ఎన్.రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు, వీఆర్వో నాసర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగార్లపాడు మాజీ సర్పంచ్ భర్త మృతి

రొంపిచర్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నలగార్లపాడు మాజీ సర్పంచ్ కొమ్మాలపాటి రాణి భర్త ఆనందరావు మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆయన మృతదేహాన్ని శనివారం సందర్శించి నివాళులర్పించారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

నిరుద్యోగ సంఘ అధ్యక్షుడిగా బూదాల అశోక్



నూజెండ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నవ్యాంధ్ర ప్రదేశ్ నిరుద్యోగ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నూజెండ్ల మండలం భూమాయపాలెం గ్రామానికి చెందిన బూదాల అశోక్ నియమితుల య్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ కుమార్ శనివారం నియమించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో కమిటీలు వేసి నిరుద్యోగులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారమయ్యే విధంగా పోరాటం చేస్తామన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో సీఆర్ విద్యార్థుల ప్రతిభ

నాదెండ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తృతీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో సీఆర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. డీఎస్సీ కెమిస్ట్రి మెయిన్స్‌లో రాయి సాయి శ్రీ సంజన ఆ సబ్జెక్టులో వందకు వంద మార్కులు సాధించారు. మొత్తం 626 మార్కులు సాధించి ప్రతిభ కనబరించింది. బీకామ్ కంప్యూటర్ విభాగంలో వీ అఖిల ట్యాక్సేషన్‌లో వందకు వంద మార్కులు సాధించింది. అత్యధిక మార్కులు సాధించిన వీరిని కళాశాల ప్రెసిడెంట్, కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, పరిలపాలన డైరెక్టర్ చుండి రంగ నాయకులు ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ మానం శ్రీనివాసరావు, చెన్నుపాటి చైతన్యలు అభినందించారు.

ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి



పిచికలపాలెంలో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి

పిచికలపాలెం(శావల్యాపురం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అప్పగించిన సర్వేలు, లక్ష్యాలను గ్రామాల్లో వైద్యసిబ్బంది సకాలంలో పూర్తి చేయాలని, లేనియెడల వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి అన్నారు. మండలంలోని పిచికలపాలెం సచివాలయాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతల వివరాలు, దీర్ఘకాలికవ్యాధిగ్రస్తుల సర్వే పురోగతి, స్కూల్ హెల్త్ ప్రోగ్రాం, ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలపై ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రజలకు వివరించి వారికి ఉన్నతమైన వైద్య చికిత్సలు అందించాలని, ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ కాన్పుల శాతాన్ని పెంచాలని, ప్రజలకు అందించే ప్రతి వైద్య సేవను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్‌ఎం గోవిందమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక క్లాసులు

- ఉదయం, సాయంత్రం 10వ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్
- వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ
- వంద శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయుల కృషి

బొల్లాపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతే ప్రధానం కాకుండా ఎక్కువ మార్కులు సాధించటంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్టడీ అవర్స్ పేరుతో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గతంలో కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూనే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మార్చి 17 నుంచి జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. బొల్లాపల్లి మండలంలో నాలుగు జడ్పీ హైస్కూళ్ళు, ఒక కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 148 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారు.



వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

వంద రోజుల యాక్షన్ ప్లాన్

విద్యాశాఖ ఆదేశాల మేరకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా డిసెంబరు మొదటి వారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేస్తున్నారు. విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్, రోజు వారి టెస్టులు నిర్వహిస్తూ మెరుగైన స్థాయికి చేరేలా కృషి చేస్తున్నారు. విద్యాశాఖ అందజేసిన స్టడీ మెటీరియల్ ఆధారంగా విద్యార్థులకు వారానికి ఒకసారి గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. గతేడాది మండలంలో 10వ తరగతి విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ సంవత్సరం మరింత పెంచేందుకు కృషి చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తా



పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించటమే నా లక్ష్యం. ఇందుకు స్టడీ అవర్స్‌ను సద్వినియోగం చేసుకుంటున్నాం.

-ఎం.నీలా నాయక్ వెల్లటూరు జడ్పీహెచ్ఎస్ స్కూల్

సందేహాలు నివృత్తి చేస్తున్నారు



ఉదయాన్నే బడికి రావటంతో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు చక్కగా గుర్తుంటున్నాయి. తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాల్లో సందేహాలు ఉంటే ప్రత్యేక తరగతులు సబ్జెక్టుల వారీగా నివృత్తి చేసుకుంటున్నా. స్టడీ అవర్స్ మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

- టీ.అమృత, వెల్లటూరు జడ్పీహెచ్ఎస్ స్కూల్

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. పాఠశాలల వారీగా ఇప్పటికే టైం టేబుల్ ఇచ్చి ఇందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించటమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

-షేక్ అలీషా, ప్రధానోపాధ్యాయులు, వెల్లటూరు జడ్పీహెచ్ఎస్ స్కూల్

పట్టణ పారిశుధ్య పనులు.. పాల్గొన్న ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డులో పారిశుధ్య కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అర విందబాబు పాల్గొని చీపురుపట్టి వీధులు శుభ్రం చేశారు. కాలువల్లో పూడికను తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



మురుగుకాల్వల్లో దోమల నివారణ మందుల పిచికారి చేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో పట్టణాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని అన్నా రు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఆరోగ్యం బాగుంటేనే జీవితం బాగుంటుందని చెప్పారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నా రు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆలపాటితో ఆత్మీయ సమావేశం

వినుకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు పంచుమర్తి భూపతిరావు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రులు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

చోరీ చేసి లక్ష మద్యం తాగేశారు

- రెండు మద్యం షాపుల్లో దొంగతనాలు
- వినుకొండకు చెందిన 8 మంది ఆటో డ్రైవర్ల అరెస్టు

అద్దంకి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు, బేల్దారు పనులు చేస్తూ చిల్లర దొంగతనాలతో మద్యం వ్యసనాలకు లోనైన ఎనిమిది మంది కలిసి మద్యం దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. వినుకొండకు చెందిన వారు స్థానికంగా చోరీలకు పాల్పడితే దొరికి పోతామని అద్దంకి, బల్లికురవ మండలాల్లోని మద్యం షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. అద్దంకి ప్రాంతంలో రెండు మద్యం షాపుల్లో చోరీ చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ముఠాను శనివారం మీడియా ఎదుట హాజరుపరిచిన చీరాల డీఎస్పీ మొయిన్ వివరాలు వెల్లడించారు. వినుకొండలో నివాసం ఉంటున్న మంగళగిరికి చెందిన మందూరి శ్రీరామ్(శాస్త్రి), నూజెండ్ల మండలం ఐనవోలుకు చెందిన తూమాటి చరణ్(ఇర్మియ), ప్రకాశం జిల్లా



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితులు, వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్, సీఐ సుబ్బరాజు

త్రిపురాంతకం మండలం లేళ్లపల్లికి చెందిన పోలా వెంకటరెడ్డి, బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడుకు చెందిన నక్కా లక్ష్మణరావు(లక్కి), వినుకొండకి చెందిన సిద్దాబత్తుల రామసాయి, షేక్ చినఫరీద్‌బాషా(పండు), వేముల నాగరాజు, అనిల్ గతంలో పలు చోట్ల బడ్డీ కొట్లలో దొంగతనాలు చేసి జల్సాలకు అలవాటు పడ్డారు. మద్యం షాపుల్లో దొంగతనాలు చేస్తే పెద్ద మొత్తంలో మద్యం, నగదు దొరుకుతుందని గత నెల 27న వినుకొండ నుంచి శ్రీరామ్‌కు చెందిన కారులో అద్దంకి మండలం శాంతినగర్‌కు వచ్చారు. ఆ సమీపంలోని మారుతీ వైన్స్ షట్టర్ పగలగొట్టి రూ.2,37,630 విలువైన మద్యం బాటిళ్లను దొంగలించారు. ఆ తర్వాత బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు సమీపంలోని అంకమ్మతల్లి వైన్స్ వద్దకు వచ్చి వాచ్‌మన్‌ను బెదరించారు. అతడు పారిపోగా షాపు తాళం పగలగొట్టి అందులో 20 వేల రూపాయల నగదు, 96 మద్యం బాటిళ్లు, సెల్‌ఫోన్ చోరీ చేశారు. టెక్నాలజీ సహాయంతో వినుకొండకు చెందిన వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో శనివారం ఏడుగుర్ని అరెస్టు చేయగా అనిల్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. రూ.1,59,130 విలువైన 433 మద్యం బాటిళ్లు, 10వేల నగదు, గడ్డపార, కారును స్వాధీనం చేసున్నారు. 4 రోజుల వ్యవధిలో సుమారు రూ.లక్ష విలువైన 348 మద్యం బాటిళ్లు మద్యం తాగడంతో పాటు స్నేహితులు, బంధువులకు పంచినట్లు డీఎస్పీ తెలిపారు. తక్కువ ధరకు అమ్మకాలు చేశారన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నరసరావుపేట అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

శర్మ ఆధ్వ ర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో స్వామి వార్ల కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో దంపతులు పాల్గొన్నారు. తిరు పతి నుంచి వచ్చిన వేద పండితులు స్వామి వార్ల కళ్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తుల కు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

8, 9 తేదీల్లో ఉచిత శిక్షణ తరుగుతులు

నరరావుపేట టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 8, 9 తేదీల్లో ఉచిత వక్త శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని సమన్వయకర్త డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. కళాశాల ఆవరణలో శనివారం శిక్షణకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యూష మాట్లాడుతూ స్టెప్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, డిగ్రీ ఫార్మసీ, మెడికల్, పీజీ, డిప్లొమో చదువుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయినులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు అదనపు సమాచారం కోసం 9704266214, 9030616331 నంబర్లను సంప్రదించాలన్నారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాల తో మెటీరియల్, సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంఏ ఎం విద్యాసంస్థల అధినేత ఎంఆర్ శేషగిరిరావు, డైరెక్టర్ శ్రావ్య పృథ్వీరాజు, సమన్వయ కర్తలు ఎస్ రామారావు, ఎం శ్రీనివాసరావు, వైవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ వైభవ్ నూతన కమిటీ ఎన్నిక

బొల్లాపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లటూరు వాసవి కల్యాణ మండపంలో శనివారం వాసవి క్లబ్ వైభవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జవల్లి సుబ్బయ్య, కార్యదర్శిగా అర్వపల్లి సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా కోటా శ్రీనివాసరావులను డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ గజ్జవల్లి నాగ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షుడు సుబ్బయ్య మాట్లాడుతూ కమిటీకి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. నూతన కమిటీని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కజ్జాయం విజయలక్ష్మి, మునగాల చిరంజీవి, గ్రంధిశిల గురువుశెట్టి, మండవ సత్యనారాయణ, దేసు కోటేశ్వరరావు, కజ్జాయం సురేష్ కుమార్, చిలంకూరి కోటేశ్వరరావు, కజ్జాయం లక్ష్మీనారాయణ, అర్వపల్లి నరసింహారావు, మండవ కిరణ్ కుమార్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ఉన్నారు.

వాహనదారులందరూ హెల్మెట్ వాడాలి

● నగర డీటీవో జీ సంజీవకుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్లే వాహనదారులందరూ హెల్మెట్ వాడాలని నగర డీటీవో జీ సంజీవకుమార్ అన్నారు. శనివారం ఎస్ఎస్ఎన్ కళాశాలలో జాతీయసేవా పథకంలో భాగంగా రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదుస్సు జరిగింది. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడ పకూడదన్నారు. ఎంవీఐ ఎస్ శివనాగేశ్వరరావు మాట్లాడుతూ అతివేగం మంచిది కాదన్నా రు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై ట్రైనింగ్ ఆఫీసర్



జాతీయ భద్రతా నియమాల అవగాహన సదస్సులో నగర డీటీవో జీ సంజీవకుమార్, ఎంవీఐ ఎస్ శివనాగేశ్వరరావు, విద్యార్థులు

ఎం వాసు వీడియో ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాససాయి, ఎం అనిల్ కుమార్, సాగరిక, మంజుల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఆర్ వేణుమాధవ్, ఏ సరళాదేవి, ఎస్ శ్రీనివాసులు, టీవీ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టిన మైనింగ్ ఏడీ

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకనగొండ గ్రామ సమీపంలోని జయపురం వద్ద ఉన్న స్వస్తిక్ ఎక్స్‌పోర్ట్స్‌కు చెందిన గ్రానైట్ క్వారీ కారణంగా స్థానిక ప్రజలు, మూగ జీవాలకు తీవ్ర నష్టం జరుగుతుందని గ్రామస్థులు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆంజనేయులు ఆదేశాల మేరకు మైనింగ్ ఏడీ నాగిని క్వారీ ప్రాంతాన్ని శనివారం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి క్వారీ వలన ఏర్పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. క్వారీలో పేలుడు కారణంగా నివాస గృహాలు బీటలువారుతున్నాయని, పేలుళ్ళ తాకిడికి వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం క్వారీని మూసివేయాలని ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె



క్వారీపై ఏడీకి ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్వారీ తాకిడికి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఆటోకాడ్ పరిశోధన పద్ధతులపై వర్క్‌షాప్



ట్రైనర్ బీ దాలినాయుడుతో సెక్రటరీ షేక్ కరీమ్ మొహీద్దీన్, ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆటోకాడ్ పరిశోధన పద్ధతులపై వర్కుషాపు వారం రోజుల పాటు నిర్వహించారని ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు శనివారం తెలిపారు. ముఖ్యఅతిథి ఏపీఎస్ఎస్‌డీసీ సాంకేతిక నిపుణులు, ట్రైనర్ బీ దాలినాయుడు భవన నిర్మాణ రంగాల్లో అనుసరించాల్సిన నూతన బిల్డింగ్ ప్లానింగ్స్, వాటి రూపకల్పన గురించి వివరించారు. ఇటువంటి విశ్లేషణా త్మక ప్రయోగంతో జరిగే వర్కుషాపులను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని కళాశాల సెక్రటరీ షేక్ కరీం మొహీద్దీన్ అన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకో వడంతోపాటు, వారి విభాగాలకు సంబంధించిన ఉద్యోగాలు పొందుటకు ఈ వర్కుషాపు ఎంతగానో దోహదపడుతుందని ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ అన్నారు. వర్కుషాపులో సివిల్ విభాగాధిపతి షేక్ అఖిల్ అహ్మద్, సివిల్ బ్రాంచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పరిశీలన

రొంపిచర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బండి నిర్మల శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యా



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ బండి నిర్మల

యులతో మాట్లాడారు. మొత్తం 218 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్టు ఆమె తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్టు తెలిపారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధానపరిషత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శనివారం జరిగిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలపారు. డాక్టర్లు కే



రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ కే రామేశ్వరి, పీ స్పందన, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

రామేశ్వరి, పీ స్పందన విద్యార్థులకు రక్తదానం ఆవశ్యకతను తెలియజేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజే శారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ డీ యోగే శ్వరరావు, బ్లడ్ బ్యాంకు స్టాఫ్ నర్స్ బీ నాగరాజకుమారి, ల్యాబ్ సూపర్‌వైజర్ కే క్రాంతి కుమార్, ల్యాబ్ టెక్నీషియన్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమావేశం

నూజెండ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నూజెండ్లలోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లలో ఉన్న పరికరాలను మండల ప్రత్యేక అధికారి వీ.సుబ్బారావు శనివారం పరిశీలించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీ.రమేష్ కుమార్, ఎంపీడీవో పీ.ఉమాదేవి, ఎంఈవో ఎన్.రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నూజెండ్ల జెడ్పీ పాఠశాలలో సౌకర్యాలను పరిశీలిస్తున్న మండల స్పెషల్ అధికారి వరద సుబ్బారావు